

# సక్కని సుక్కమ్మ

గోవిందరాజు శ్రీనివాసము

ఇదివరకోపాలి ఇట్టనే అయింది. యీరమల్లు గడెక్కి ఆపతనే ఉన్నడు. కాలేమో బర్రనజారింది. ఎట్టగో తట్టుకుని నిలబడిండు. ఆ కరమే యియ్యాలాపట్టింది. సుట్టూరా ఎంతమంది పోగైతన ఆట సూత్తిన్నా, కాలుమాత్రం ఎన్నటికీ జారేది కాదు. గడమీన అటునుంచి ఇటూ, ఇటునుంచి అటూ ఎంతలగత్తినా, భూమ్మీద నడిసినట్టే నడిసేవోడు. అట్టాంటిది ఇయ్యాల ఆటయములో ఎందుకట్టా అయిందో యీరమల్లుకే తోసలేదు. కింద సుట్టూరా జనంపోగై తన ఆట సూత్తన్నారు. అంతవరకూ, కిందే నిలబడి గరిడీలు తిప్పిండు. "ఇంతస్పీటుగా గరిడీ తిప్పగలిగినోడు వోల్ ముత్తంమీన ఈడే," అని జనం అచ్చెర్యపడినమాట నిజం.

అప్పుడే గడెక్కిన యీరమల్లుకు సుట్టూరా మూగినజనం ఎనకపాలిగా ఇంటి గుమ్మంమీన కూకుని ఆట సూత్తన్న సుక్కమ్మ కనబడింది. దాన్ని సూసిన కాడనుంచి ఆడి మనసు గడమీన లేదు. సుక్కమ్మొంకే సూత్తిన్నడు. సుక్కమ్మకు ఇదేం పట్టలా. "బాగానే ఆడ్తండు." అనుకుంటూ మిగతా జనంతో పాటే చప్పట్లు కొడ్తన్నది. యీరమల్లుకే మోహనచకసుబులు మల్లుతన్నది. ఆట అయినాక గడదిగిండు. నేరుగా జంగమల్లును కూకేసి మెల్లగా "వోరూ ఆ గుమ్మంమీన కూకుంది ?" అని అడిగిండు.

జంగమల్లు నవ్వుతా "అదే నేనూ సూత్తన్నా. పేరు సుక్కమ్మంట-అయినా నీకేం పొయ్యేకాలం—మొన్నేగా ఆ ఫూళ్లో యీపు సదును సేయించుకొచ్చేవ్ — మల్లీ మొదలా," అన్నాడు.

యీరమల్లంత మొండోడు ఈ భూమ్మీన లేడు. అసల ఆడిపేరు నారిగాడు. ఖోరీ తిగనాల కు సీపందాల్లో అయిదుగురిని అట్టే పంపబెట్టినోడు ఆడు. తొడగొట్టిండంటే అరమైలు యినబడది. ఆడిత్తోడ సప్పుడికే అదిరి సచ్చినోళ్లున్నారు. గోదాలోకి దూకిండంటే సర్ సర్‌మంటూ ఈతబెత్తంలా దూసుకు పోగలిగినోడు. నారిగాడన్న పేరు బాగాలేదని యీరమల్లు అన్న పేరు ఆడే పెట్టుకుని ఊరూరా సవాల్ చేసిండు—కాని కుస్తీలు పట్టి పట్టి యిసుగు పుట్టింది గావాల్న—గరిడీలు తిప్పటం నేర్చుకొనిండు. ఈ యిద్య బాగా సేతున్నది. ఊరూరా తనఆట సూపిత్తా గంజి కాసు కుంటున్నాడు.

ఆ రోజు ఆట ఆడ్తన్నప్పుడు కింద కూకున్న సుక్కమ్మను సూసిన యీరమల్లు ఇక సుక్కమ్మను మరిసిపోలే. ఆ రేత్రి పండుకున్నాగాని సుక్కమ్మే సుట్టూ తా తిరిగింది.

"ఓ యబ్బ—ఏం సక్కదనం—ఇంతమందిని సూసినాగాని ఈ గుంటయి ఏం కళ్ళబ్బ! గిర్రున సెక్రాల్లా తిప్పుతున్నది," అని ఒకటే ఆలోచించిండు యీరమల్లు. నిద్రేమో పట్టలేదబ్బ!

తెల్లారి లెగిసిన కాడనుంచీ సుక్కమ్మను గురించే ఆలోసిస్తన్నడు. "ఓరబ్బా ఆ గుంట."—ఇదే ఆలోసన—ఇదే ఆలోసన.

"ఏది ఎట్టున్నగాని, దీని సంగతి కనుక్కోవాలి," అని గట్టిపట్టుపట్టిండు.

సాయంత్రం నాలుగు గొట్టింద్రు. యీరమల్లు దబదబ తనుగడెక్కి ఆడినపాటు కెల్లి సుక్కమ్మఇల్లు పసిగట్టి ఏం సేసేందుకూ తోసక తలుపు తట్టిండు.

లోపటాలనుంచి "వోరూ," అంటూ తలుపు దీసింది సుక్కమ్మ. ఎట్టెదర సుక్కమ్మ నిలిసేతలికి అదిరిపడిండు యీరమల్లు.

"అబ్బ! ఏం సక్కదనమబ్బ! పనసతొనాలె ఉందబ్బ!"—ఆ మాటలు బయటకు రాబోయినయ్ గాని అణిసేసిండు.

ఏం సెప్పాలో తోసలా యీరమల్లుకు. మరి తలుపుతట్టిండుగందా. ఏదో సెప్పాలె.

"నిన్న గడెక్కి ఆడినోళ్ళం—నూకలు అడుక్కుంటన్నం—నా పేరు యీరమల్లు," అని దరిజాగా నిలబడిండు. సుక్కమ్మేం పల

# ★ సక్కని సుక్కమ్మ ★

కలా—అట్టే ఎనక్కుమల్లి సాటలో నూకలోసకొచ్చి "జోతెట్టు," అనింది.

జోతేమో లేకపాయె యీరమల్లుకాడ.

"జోతె లేగు—మాట గట్టేంగుకు పెట్టలేదు—పోస్తే—పొద్దుగూకి నేకవచ్చి తీసకెల్తా," అనిండు సన్నగా ఇకిలిత్తా.

ఆ సూపులేమో నచ్చకపాయె సుక్కమ్మకు "ఎందీడు-అడుక్కుంటను వొచ్చినోడు పెబట్టు తెచ్చుకోడూ," అనుకుని దబేల్‌మంటూ తలుపేసేసింది. యీరమల్లు వళ్ళు సివుక్కుమంది.

"అరెరె, సేతికిసిక్కిందాన్ని వదిలేత్తినే." అని నాలిక కసుక్కున కరుసుకొన్నాడు.

"అయిపోయిందేమో పోయె - పొద్దుగుంకి నేల వత్తనన్న గండా. అప్పుడు సూపాల తడాఖా," అనుకొని ఏం సేసేందుకూ తోసక అట్టే ఎగుదుమూలెగా కూకొన్నాడు.

అట్టనే ఎంతసేపు గూకొన్నగాని పొద్దుగూకదాయె—బీడీ మీన బీడీ ఎలిగించిండు.

ఎట్టగయింతే నేం—సుక్క పొడిసింది.

యీరమల్లు సక్కగ తలదువ్వుకొన్నడు.

సుక్కమ్మింటి తలుపుతెరుసుకొని బుంగమీసాలోడు ఒడు బయటకొచ్చి,

"సుక్కమ్మోయ్ - బద్రం —పిల్లది బద్రం - పాలేరుగూడ లేడు. పొలంకాడ కాపుండకపోతే సామ్మ మంది కాదు," అంటూ బదబరనడిసి ఎల్లిండు. సుక్కమ్మ పల్లగ నవ్వింది గాని ఆడు గమనించలా.

యీరమల్లు గమనించిండు.

ఆడికి మంచి అదను వొదికింది.

"పాలిగాడు కూడ లేడన్నమాట- బలే బలే," అని సంకలు కొట్టుకొనిండు.

"ఊరు మాటుమణిగినా నక చిక్కుం ఎయ్యాల," అని అట్టట్ట తిరిగొచ్చేందుకు ఎల్లిండు.

పున్నమేమో - యెన్నెల యిరగ కాస్తన్నది - ఆ యెలుగులో సుక్కలు సోకు సేసుకుంటున్నయ్, రోడ్డుమీన ఊరకుక్క తెగతిని అవుల్తన్నది. యీడో తెచ్చిన సెంటు సొక్కాకు పులిమి మీసానిక్కూడ కుసింత తగిలించి అది దువ్వుకుంటా నేరుగా సుక్కమ్మింటికేసి మల్లిండు యీరమల్లు.

బయట తలుపుసప్పుడయ్యే తలికి సుక్కమ్మ అదిరి పడ్డది. "పాలేదు లేకపొయ్యె ఈయనేమో పొలంమీనకెళ్ళె! అర్ధరేత్రి ఓరు తలుపు తడతరు—గుబులుపుట్టె ఈనే ఒచ్చిండేమో, అనుకుంటూ బయం బయంగానే వచ్చి తలుపుతీసి "వోరూ ?" అంది.

ఎదరనే యీరమల్లు!

నవ్వుతన్నడు.

"నేనే సుక్కమ్మా—నూకలకు జోతె తెచ్చినా," అన్నదు నవ్వుతనే.

"అర్ధరేత్రి వొతేస్తదు," అంటూ తలుపు ఎయ్యబోయిందిగాని యీరమల్లు సెయ్యి అడ్డంబెట్టి తలుపు అట్టనే అదింపట్టి సుక్కమ్మను లోనకు తోసుకుంటూ.

"జోతె తెచ్చినా సుక్కమ్మా—నూకలెయ్యి—ఏస్తనంటివిగా," అంటూ లోనికొచ్చిండు.

సుక్కమ్మ గజగజ లాడింది.

"దొంగ"ని అరుద్దామంటే నోరు పెగల్లేదు. యీరమల్లు నవ్వుతా లోన కొత్తన్నడు—

"నూకలేదోయ్ సుక్కమ్మా," అంటూ లటుక్కున సెయ్యి పుచ్చుకున్నాడు. సెయ్యి యిదిలించి కొట్టి సక్కంగ లోన కురికింది సుక్కమ్మ. దొడ్డి గుమ్మంటాలనుంచి లగెత్తొచ్చనుకుంది.

యీరమల్లు దాన్ని పోనీయలా. మల్లీ సెయ్యి పుచ్చుకొన్నడు.

"అమ్మనాయనో- అమ్మనాయనో, అంటన్నదేగాని కేక గట్టింగ పెగిలిరాదాయె"

యీరమల్లేమో ఇంకా నవ్వుతనే "నేనంటె మాటలనుకున్నావు గావాల్న సుక్కమ్మా! నాకోసం ఎంతమంది గుంటలు కాసుకున్నారో నీకు తెలీదు గావాల్న. అళ్ళందరినీ కాదని నిన్నే కోరా—రా సుక్కమ్మా అరిత్తే ఏం లాబం," అని దగ్గరకెళ్ళిండు.

"ఎదవా - ఎవరనుకున్నావ్ - రేపు నీ పని పడతా - పంచాయితీ జరిపిత్తా." అన్నది సుక్కమ్మ. కోపంతో సెమటోసి నొసలిమీని యీపాయంత బొట్టు కరిగి ముక్కుమీనకు కారతన్నది.

"రేపు అట్టగె పంచాయితీ జరిపిద్దువుగాన్లే సుక్కమ్మా, యియ్యాల నాకోరిక తీర్చు-కాదనకు," అంటూ దగ్గరకు లాక్కుబోయాడు యీరమల్లు.

ఆడి చంప ఛళ్ళుమంది.

ఒక అదటులో పిల్లదాన్ని సంకనేసుకుని పక్కనున్న గదిలోకెల్లి టప్పున గడియెట్టింది. బయంతో రొప్పుతున్నది.

పోని బయటకు లగెత్తుదామంటే ఇంకో దారగం లేదాయె. అరుద్దామంటే ఓరికీ ఇనపడదు. బయంతో నోటింట మాటరాక పాయె.

యీరమల్లుకు ఏంసేయాలో తోసలా. పిట్ట జారిపోయింది గాని, ఇట్లనే వదల కూడదనుకొనిండు.

"సుక్కమ్మా! నువ్వెంత తలుపేసిన గాని ఇయ్యాల నాపంతం నెగ్గాల్సిందే!" అంటూ తలుపు గట్టిగ తోసిండు. తలుపు తెరసకరాలా, పక్కనే గడ్డపార కనబడేతలికి యీరమల్లు కళ్ళు మెరిసనై. అదెట్టి మండిగం కింద తొవ్వటం మొదలేసిండు. అట్ట కొంత తొవ్వేతలికి అనుగున మట్టి మొకన్నం పడింది. అది పెద్దదిసేసిండు. ఒకమడిసి దూరేంతకన్నం అయింది. ముందు తలదూర్చి సక్కగ ఆ పక్కకు దూరతన్నాడు. సగం అటువేపు వచ్చేతలికి పాములాగ వస్తున్న యీరమల్లును సూసి సుక్కమ్మ కళ్ళు బైర్లు కమ్మినై. పసిదేమో గుక్కెట్టతన్నది.

సుక్కమ్మవళ్ళు కోపంతో గజగజ లాడ్తన్నది "పోలేరమ్మా, ఇయ్యాల వోరిముకం సూసేనో గాని యీడు దాపురించిండు. నువ్వే నన్ను కాయాలి నా పోలేరమ్మా," అని పోలేరమ్మను మనసునపెట్టి సుక్కమ్మ సయ్‌మంటూ లెగిసింది. పున్నమంటి సుక్కమ్మ మహంకాళి అయింది. ఏంచేస్తన్నదో దానికే తెలియిలా. అటూ ఇటూ సూసేతలికి మూలనున్న గునపం కనబడింది. పసిదాన్ని ఓ పక్కన పంపెబెట్టి గునపం ఎత్తి పస్‌మంటూ యీరమల్లు నడిమీన దిగేసింది "అమ్మో" అని యీరమల్లు ఒక్కకేసి గిలగిల లాడిండు.

పసిదాని గుక్కకు లెక్కలేదు.

సుక్కమ్మ కళ్ళు రగతం చిమ్మినయ్. పసిదాన్ని ఎత్తుకుని తలుపు దనామంటూ తీసి రోడ్డుమీనకు లగెత్తుకొచ్చి పోలికేక లేసింది. ఒక్క నిముసంమీన ఊరంతా మేలుకొంది.

సూత్తే బయం పుడ్తన్న సుక్కమ్మను సూసి "ఏంది సుక్కమ్మా." అంటే మాట్లాడదు. కళ్ళనీళ్ళేమో సెరువుగడ తెన్నై.

"పోలేరమ్మా—ఏందిది పోలేరమ్మ నా సేత ఈపని సేయించినావే—నీకీ అన్నాయము సేసినా—నీకేం తక్కువసేసినా," అంటన్నదే గాని అసలు సంగతి సెప్పదు.

కోటయ్యవచ్చి నిలేసి అడిగిండు.

"ఏంసెప్పను కోటయ్యమావా—ఆడి రగతం సూశా. సంపినోళ్ళకు సిచ్చ పడతందంట నిజమేనా కోటయ్యమావా!" అంటూ "నాకు సిచ్చ పడాల్సిందే" అని బావురుమంటన్నది.

కోటయ్యతోబాటు మిగతా జనం అట్టనే చూస్తన్నారు.

ఉన్నట్టుండి పసిదాన్ని ఎత్తి నేలమీన కుదేసి పకపక నవ్వుతా రోడ్డుమీద లగెత్తుకు పోయింది సక్కని సుక్కమ్మ. ★

ఉత్సాహము?

అమృతబిందు - నరముల శక్తికి, మతి మాంద్యమునకు గొప్పటానిక్. ఇది చూపులోపమును, మందమతివి నరాల అశక్తత పోగొట్టి శక్తినిచ్చును ఉత్సాహమిచ్చును రు. 10.75. Kj A UEN GPTA, Boolu Ousadhalaya Calcutta-38.